# యుద్ధం

మధ్యాహ్నం మాగన్నుగా నిద్రకి ఒరిగినప్పుడు తల్లి కనిపించి కన్నీళ్ళు పెట్టుకున్న దృశ్యం. ఉలిక్కిపడి లేచింది రేవతి. ఎల్లుండి తన పుట్టిన రోజుని అమ్మ చెప్పినట్లుగా అనిపించింది. ఎప్పుడో మర్చిపోయిన పుట్టిన రోజు అకస్మాత్తుగా గుర్తుకు రావడం ఆశ్చర్యం కలిగించింది.

తలుపు ఎవరో కొడుతున్నారు. కరెంట్ పోయినట్లుంది. ఫ్యాన్ ఆగిపోయింది. కాలింగ్ బెల్ మూగబోయింది. తలుపు మీద మళ్ళీ ఎవరో కొట్టినట్లయింది.

రేవతి నెమ్మదిగా లేచి ముఖం, మెడ, మోచేతులు చెమట పట్టి ఉంటే కొంగుతో తుడుచుకుంటూ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా పార్వతమ్మ నిలబడి ఉంది. "రండి పిన్నీ" అంటూ లోపలికి వెనుతిరిగింది.

తల్లి పోయినప్పట్నించీ పార్వతమ్మే రేవతికి పెద్ద దిక్కు. కాఫీ కలిపిచ్చి "ఏమిటి పిన్నీ చెప్తానన్నారు" అంది తనూ కప్పు తీసుకుని ఎదురుగా కూర్చుంటూ.

"ఎలాగైనా నువ్వు పెళ్ళి చేసుకుని ఓ ఇంటి దానవవ్వాలి రేవతీ" అందామె.

రేవతి నవ్వింది. "మీకు నా మీద ఎంతో అభిమానం. అందుకే అలా అంటున్నారు. కానీ ఆ మాట మర్చిపోండి" అంది.

"కాదు నేనో ముఖ్యమైన విషయం చెప్పడానికే వచ్చాను" అందామె. రేవతి గుండెలు గుబగుబలాడాయి. ఏమిటీమె చెప్పబోయే విషయం? ఏమిటీ అన్నట్టు చూసింది పార్వతమ్మ వైపు.

"భాస్కరం గారు తెలుసు కదా" అంది.

"భాస్కరం మాష్టారు కదా!"

"అవును ఆయనే – తెలుసుకదా, ఆయన పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాడు.

మొన్ననే రిటైరయ్యాడు – అరవై దాటాయి. నువ్వు సరే అంటే నిన్ను చేసుకుంటాడు" అంటూ ఆగింది పార్వతమ్మ.

"నువ్వూ చిన్న పిల్లవేం కాదు. ఎల్లుండి నీ పుట్టిన రోజు. నలభై వస్తాయి".

అమ్మలాంటి ఆమెకి తన పుట్టిన రోజు గుర్తుందంటే చిత్రంగా ఉందనిపించింది.

"నాకిప్పుడు పెళ్ళేంటి పిన్నీ" అంది తేలికగా.

"అలాగనకు. నీకంటూ ఒక ఇల్లూ – వాకిలీ, కాస్త డబ్బూ, స్వేచ్ఛా సొతంత్రం ఉండాలి. ఏది కావాల్సినా దర్జాగా నీ చేత్తో నువ్వు ఖర్చు పెట్టుకోవాలి. అవన్నీ నీకుంటాయి. నా మాట వింటే".

"అంతా నీ ఇష్టం లాగే చెప్పేస్తున్నావే" అంది.

"నా ఇష్టం కాదు. ఆయనే నోరు విప్పి అన్ని సంగతులూ చెప్పాడు" అని గొంతు తగ్గించి "ఇప్పుడతనికి పన్నెండు వేలు పెన్షనొస్తుంది. ఎటు తిరిగెటైనా – నీకు జీవితాంతం హాయిగా గడిచిపోతుంది. ఇల్లుంది".

ఇవన్నీ వ్యాపార ఒప్పందాలు. రేవతి తల తిరిగింది. పైకేమీ మాట్లాడలేదు. ఉలిక్కిపడింది.

"ఛీ! అవన్నీ ఎందుకు పిన్నీ" అంది.

"అవే కావాలి. ఇక్కడ చూడు. రెక్కలు ముక్కలు చేసుకున్నా నీ చేతిలో పైసా ఉండదు. జీతంగా నువ్వడగలేవు. వాళ్ళివ్వరు. పోను పోను నీకు ఓపిక లేకపోతే కప్పు కాఫీ ఇచ్చే వాళ్ళుండరు" పార్వతమ్మ మాటలు సాగుతూనే ఉన్నాయి. రేవతికి కొన్నే వినిపిస్తున్నాయి – వేరే ఆలోచనలు ముసురుతున్నాయి.

జీవితం ఒక పెద్ద వ్యాపార సంస్థ. రకరకాల వ్యాపారాలు ఇందులో నడుస్తూ ఉంటాయి. అందులో పెళ్ళి అనేది ప్రధానమైన వ్యాపారం. ఎన్నో లావాదేవీలు ఈ వ్యవహారంలో సాగుతూంటాయి.

"ఏమిటీ వింటున్నావా" అందామె.

రేవతి ఉలిక్కిపడింది. "ఆ... ఆ.." అంది.

అయితే ఆమె ఊరుకోలేదు.

"కాస్త చాదస్తుడే గానీ చెడ్డవాడేం కాదు. భార్యపోయి పదేళ్ళు దాటింది. తోడుగా, తనని చూసుకునే ఆడ దిక్కు కావాలని, కంచంలోకి ఇంత అన్నం వస్తుందని ఆశ పడుతున్నాడు".

ఇచ్చి పుచ్చుకునే వ్యాపార సంస్కృతికి ఇదొక ప్రతీక. పడి ఉండి, పని చేసే మనిషి – భార్య రూపంలో ఉండాలి.

"కానీ.. పిన్నీ... ఇదంతా నాకెలాగో ఉంది – అలాంటి విషయాలు ఆలోచించే స్థితిలో లేను".

"నువ్వూరుకో – నీ మంచి కోరేదాన్నని నా మీద నమ్మకం ఉంది కదా!" సూటిగా

కళ్ళల్లోనికి చూసి అడిగేసరికి రేవతి తడబడింది.

"అయ్యో పిన్నీ! మీకంటే నా కెవ్వరూ లేరని మీకు మాత్రం తెలీదా" అంది.

"అందుకే నేను చెప్పినట్లు విను - అయినా నువ్వూ ఈ రాత్రి ఆలోచించుకో- సానుకూలంగా ఆలోచించు. అతనివల్ల నీకొచ్చే కష్టం ఏమీ ఉండదు" అని కొంచెం ఆగి "మొన్న జరిగినది చూశాక నేను మరీ ఇదయిపోయాను" అంది పార్వతమ్మ చివరగా.

రేవతి మనసులోనూ మొన్న జరిగిన అవమానం ఒక్కసారి భగ్గుమంది. పెళ్ళి అనే విషయం ఆమె ఆలోచన జీర్ణించుకోలేకపోయినా, తనకేమాత్రం గౌరవం లేని చోట ఉండకూడదు అనిపించింది.

"మీ మాట మీద గౌరవం, నమ్మకం తృప్తిస్తే నాకీ వ్యవహారం మీద పెద్దగా ఇంట్రస్టు కలగడం లేదు" అంది.

"కలిసి వస్తే, అన్నీ ఇంట్రస్టులూ అవే వస్తాయి" అంటూ ఊ అనిపించి మరీ వెళ్ళింది పార్వతమ్మ.

• • •

పాతికేళ్ళ క్రితం రేవతి పదిహేనేళ్ళ పిల్ల. పదో క్లాసు ప్యాసయ్యి ఉత్సాహం ఉరకలేస్తూ ఏదో చేసేద్దామనుకునే లోపు బొమ్మగా ఉన్న జీవితం బొరుసై పోయింది. తండ్రి యాక్సిడెంటులో చనిపోవడం, ఆ బెంగతో తల్లి మంచమెక్కడం - రేవతి పెద్దపిల్ల కావడం - తమ్ముణ్ణి, చెల్లెల్ని - మంచం దిగలేని తల్లినీ సంరక్షించవలసిన బాధ్యత మీద పడిపోవడం - ఆమెకు పదేళ్ళ వయసుని మీద పడేశాయి. ఇంటి పనులు, బయట పనులు చేస్తూ, ఆర్థిక ఇబ్బందుల వల్ల, ఎలిమెంట్రీ స్కూల్లో చిన్న జీవితానికి టీచరుగా డబ్బు సంపాదించి కుటుంబాన్ని నడిపించవలసిన స్థితి. వచ్చీరాని చదువుతో, చాలీచాలని జీతానికి జీవితం తాకట్టు. ఆ తర్వాత అంతా పాత కథే. తమ్ముడు బాగా చదువుకుని, మంచి ఉద్యోగం సాధించి, దండిగా కట్నం తీసుకుని పెళ్ళి చేసుకున్నాడు. ఎం.సి.ఏ చేసిన చెల్లెలు ఉద్యోగంలో చేరిన మూడు నెలలకే కొలీగ్‌ని ప్రేమించి పెళ్ళిచేసుకుని ఆనందంగా స్థిరపడిపోయింది.

తల్లి దాటిపోయింది. రేవతికి పెళ్ళి వయసు దాటిపోయింది. తమ్ముడు పిల్లల్ని కొంతకాలం, చెల్లెలు పిల్లల్ని కొంతకాలం సాకి, వాళ్ళు స్కూలు కెళ్ళే స్థితికి తీసుకొచ్చింది. ఈ సేవల్లో ఆ చిన్న ఉద్యోగం కాస్తా ఊడిపోయింది.

ఉద్యోగం ఊసు వచ్చినప్పుడల్లా "నీకా ఉద్యోగం లేకపోతేనేం - మేం ఇస్తాంలే ఆ జీతం" అని ప్రగల్భాలు పలికిన వారు పైసల దగ్గర మహా గట్టిగా ఉండేవారు. ఎప్పుడు రేవతికి డబ్బు అవసరం వచ్చినా, వంద లెక్కలు పెట్టి, వెయ్యి ఆరాలు తీసి, చివరికి అసంతృప్తి ముఖాలతో అనుకున్న దానిలో సగం చేతిలో పెట్టి 'మళ్ళీ ఇస్తాంలే' అంటూ గడుపుతున్నారు.

• • •

ఆరోజు పార్వతమ్మ ఇంట్లో రేవతిని కలిసి భాస్కరం మాట్లాడాడు.

"ఇదిగో అమ్మాయీ - ఈ వయసులో పెళ్ళేమిటి అని అందరూ ఆక్షేపిస్తారు. నిజమే, కానీ వయసు పెరుగుతున్న కొద్దీ నాకూ ఒక తోడు కావాలనిపిస్తోంది. నువ్వంటే నాకు అభిమానం. నీకూ ఒక నీడ కావాలని భావించాను. అందుకే పార్వతమ్మక్కయ్యతో విషయం చెప్పాను. నువ్వు నాకు ఇల్లూ వాకిలీ చూసిపెట్టి, ఇంత అన్నం వండి పెడతానని ఆశ. అంతకుమించి ఏమీ లేదు. నేను లేవలేకపోతే సేవ చేస్తావు. కాస్త జావ కాచి పోస్తావు. నాకు పిచ్చిపిచ్చి ఆలోచనలు ఉంటే ఎప్పుడో ఓ చిన్నదాన్ని చూసి పెళ్ళాడేవాణ్ణి. మా ఆవిడ పోయిన ఏడాది చాలామంది వచ్చారు పిల్లనిస్తామని. నాకిష్టం లేకనే చేసుకోలేదు. ఇదిగో చూడు. నువ్వు నాకు తోడు. నేను నీకు నీడ. నువ్వు నాకు సేవ చేస్తావు. నేను నీకు రక్షణ ఇస్తాను. స్టేటస్ ఇస్తాను. నా భార్య స్థానం ఇస్తాను. నాకు మరీ చిన్నపిల్లని చేసుకోవడం ఇష్టం లేదు. నువ్వు కష్టసుఖాలు తెలిసిన దానవు. పార్వతమ్మక్కయ్య నిన్ను గురించి అంతా చెప్పింది. నాకు ఇద్దరు మగపిల్లలు - ఒకడు అమెరికా - రెండోవాడు ఆస్ట్రేలియా - వాళ్ళొచ్చి నన్ను చూసేదీ లేదు. నేను వాళ్ళ దగ్గరికి వెళ్ళేదీలేదు" భాస్కరం గుక్కతిప్పుకోకుండా మొత్తం సంగతులన్నీ వివరంగా చెప్పాడు. చాలాసేపు మాట్లాడి, చివరికి ఆమె పెట్టిన ఫలహారం తిని, కాఫీ తాగి వెళ్ళిపోయాడు. రేవతి అన్నీ వింటూ కూర్చుంది. ఆమె మాట్లాడిందేమీ లేదు. ఊ... ఆ... అవును. నిజమే... లాంటి మాటలు చెప్పింది. అంతే-

"అతనటూ ఇటూ అయినా సహం పెన్షనొస్తుంది. నువ్వున్నంత కాలం ఎవర్నీ దేహీ అనక్కరలేదు. ఉన్న ఫ్లాట్ నీ పేర రాయించే పూచీ నాదీ" పార్వతమ్మ ముక్తాయింపు ఇచ్చి వదిలింది.

పార్వతమ్మ మాటల్లోని అపశ్రుతులను పక్కకి పెట్టి, రేవతి ఒక్కటే అనుకుంది. తను సాహసించి ఒక్కర్తీ బతకడానికి బయటకెళ్ళలేదు. ఇంట్లోంచి బయట పడటానికిదో మార్గం.

రేవతి అంగీకారం తెలిపింది. ఇంట్లో తమ్ముడు, చెల్లెలు అవాక్కయి పోయారు. మరదలు నోరు మెదపలేదు. మరిది మాత్రం "ఎవరి జీవితం వారిది. ఆమె ఇష్టం ఆమెది" అన్నాడు. వారం రోజుల్లో వెంకటేశ్వర స్వామి గుడిలో వారి పెళ్ళి చాలా నిరాడంబరంగా జరిగిపోయింది. అటు ఇటూ అందరూ కలిసి పదిహేను మంది ఉన్నారు.

మరదలు ఒక బెంగాల్ కాటన్ చీర కొనిచ్చింది ఆడపడుచుకి. పార్వతమ్మ ఆశ్చర్యంతో నోరు తెరిచింది. చెల్లెలు మాత్రం కంచిపట్టు చీర కొనిచ్చింది.

భాస్కరం మాస్టారితో కలిసి ఆ ఇంట్లో అడుగు పెడుతుంటే రేవతికి చాలా చిత్రంగా అనిపించింది. ఇది కలా - నిజమా అనే అనుమానం కలిగింది. ఈ ఇల్లు తన సొంతం అనుకున్నప్పుడు చిన్న ఆనందం.

అందరికీ ఆ ఇంట్లో భోజనాలు ఏర్పాటుచేసింది పార్వతమ్మ.

ఇంట్లోకి వస్తూనే భాస్కరం లెక్చరింగ్ మొదలు పెట్టాడు. అతను మాట్లాడడం మొదలుపెడితే ఓ పట్టాన వదలడు. తను అనుకున్నవన్నీ వివరంగా చెప్పిగానీ ఒదలడు.

"ఇదిగో చూడండీ - నే చెప్పే ఈ నాలుగు మాటలు, మీ నలుగురైనా వింటే నాకో తృప్తి, ఆమె నాకు తోడు- నేను ఆమెకు నీడ. అంతే. అంతకుమించి ఏమీ లేదు. చూశారా ఈ మంచాలు ఆ మూలొకటి, ఈ మూలొకటి. వేరే చెడు భావాలతో నేనీ పెళ్ళి చేసుకోలేదు. ఆమెకి నా భార్య స్టేటస్ ఇచ్చాను. ఒక పునిస్త్రీగా గుర్తింపు కలగజేశాను. ముత్తయిదువుగా ఆమె సమాజంలో కళకళలాడుతూ తిరిగే వసతి, స్థాయి కలిగించాను. అదే నా కోరిక. రేపు ఓ శ్రావణ మంగళవారం నాడు ఆమె గౌరీదేవి - ఓ శుక్రవారం నాడు ఆమె వరలక్ష్మీదేవి. ఆ మంగళసూత్రాలు - ఆ నల్లపూసలు - ఆ మట్టెలు, ఆమె అస్తిత్వ చిహ్నాలు. అదే నా కోరిక."

ఇలా సాగింది అతని ధోరణి. అతనెంతసేపూ స్త్రీ భర్తకి చేయవలసిన విధుల గురించి, పాతివ్రత్యం అంటే ఏమిటి? అంటూ వివరించి, ఉత్తమ ఇల్లాలి లక్షణాలు పదేపదే చెప్పి వదిలాడు. అక్కడున్న ఆ కాస్తమందీ ఇబ్బంది పడిపోయారు. ముఖాలెలా పెట్టాలో తెలీక అవస్థపడ్డారు.

"ఆ మంచాలు చూశారు కదా, ఒకటి ఆ పక్కా, ఇంకోటి ఈ పక్క" - కొందరికి ఒళ్ళు మండింది. అయినా మర్యాద కాదని ఊరుకున్నారు.

రేవతి మాత్రం భోజనాలు ఏర్పాటులో పార్వతమ్మకి సహాయం చేస్తూ లోపలే ఉండిపోయింది.

పార్వతమ్మ మాత్రం కర్ణాకర్ణి వింటూనే ఉంది. అన్నీ సర్దేసి వచ్చేసి "లేలే తమ్ముడూ! వడ్డన పూర్తయింది. అందరూ ఆకళ్ళ మీదే ఉన్నారు. కబుర్లు తర్వాత" అంటూ అందర్నీ లేపింది. బతుకుజీవుడా అని అంతా లేచారు.

సాయంత్రం ఇంటికి వెళ్తూ రేవతిని పక్కకి పిలిచి "చాదస్తుడేగానీ, మనిషి మంచివాడే. భయం లేదు. నువ్వు మరీ ముంగిలా మాట్లాడకుండా ఉండకు. కాస్త మాట్లాడితేనే కదా అన్నీ తెలిసేది" అంటూ హితబోధ చేసి వెళ్ళింది పార్వతమ్మ.

భాస్కరం ఇల్లంతా అటూ ఇటూ తిరిగాడు. రేవతి శుభ్రంగా ఇల్లంతా సర్దింది. ఏడుగంటల్కి వంట చేసింది. అతను స్నానం చేస్తానంటే వేడి నీళ్ళు పెట్టిచ్చింది.

"ఊ... ఆ... అనే మాటలు తప్ప వాళ్ళ మధ్య పెద్దగా మాటలేం సాగలేదు. భాస్కరం మాత్రం స్వగతంగా, సమాజం గురించి, స్త్రీ గురించి, వాళ్ళ నడవడిక గురించి, తన నిస్వార్థం గురించి ఏవేవో మాట్లాడుతూనే ఉన్నాడు.

అన్నం తిని వంట మెచ్చుకున్నాడు. "ఈ మధ్యకాలంలో ఇలాంటి భోజనం చెయ్యలేదు" అంటూ లేచాడు. రేవతికి ఆనందమేసింది. చేసిన పని బాగుందని మెచ్చుకుంటే ఎవరికైనా సంతోషమే కదా! రేవతి ఇల్లు సర్దుకుని వచ్చేసరికి రెండు మూలలున్న మంచాలు రెండూ ఒకటిగా చేశాడు భాస్కరం.

రేవతి అయోమయంలో పడింది. కానీ నోరు మెదపలేదు. ఈ మనిషిని ఎలా అర్థం చేసుకోవాలా అనే ఆలోచనలో పడింది.

ఆమె కూర్చోగానే ఆమె గుండెల మీద చెయ్యి వేసి వెనక్కి తోశాడు. ఆమె వెల్లకిలా పడింది. అంతే. అతని శరీరం మొత్తం ఆమెని కప్పేసింది. ఉక్కిరిబిక్కిరైన ఆమె ఏం మాట్లాడలేక పోయింది. అంతలోనే అతను పనిలో పడిపోయాడు. చేతులూ, కాళ్ళూ, నోరూ, పెదవులూ విశ్రాంతి లేకుండా చకచకా చలించిపోతున్నాయి. అంతవరకూ మగ స్పర్శ ఎరుగని రేవతికి ఊహకందని విధంగా అన్నీ జరిగిపోయాయి. పెళ్ళి అని చేసుకున్నాక ఏం జరుగుతుందో ఊహించలేనంత అమాయకురాలు కాదు రేవతి. కానీ అతని మాటలకీ, చేతలకీ పొంతన లేకపోవడం ఆమె అర్థం చేసుకోలేకపోయింది.

అప్పట్నించీ తెల్లవారగానే మంచాలు వేరువేరుగా దూరంగా జరపడం భాస్కరం మొదటి పనైంది. రెండో పని ఏమిటంటే ఎవరింటికి వచ్చినా భార్యాభర్తల మధ్య ఉన్నది అమలిన శృంగారమే తప్ప మరొకటి కాదని గంటలు గంటలు లెక్చర్లివ్వడం. వచ్చిన వారికి ఆశ్చర్యం - రేవతికి అసహ్యం రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఎవరూ ఏమీ అడక్కపోయినా మంచాల వ్యవహారం మాట్లాడకుండా అతనుండడు.

ప్రత్యేకం అదే ప్రస్తావన అతని పిచ్చి.

చూసి చూసి ఒక రోజు పెద్ద పోట్లాట వేసుకుంది రేవతి.

"మీరు నన్ను పెళ్ళి చేస్కున్నారు కదా! వచ్చిన వాళ్ళందరికీ మన మధ్య ఏం లేదని చెప్పడమెందుకు" అని అరిచి గొడవ చేసింది.

"అందరూ నన్ను తక్కువగా చూస్తారు. ఈ వయసులో వీడికి పెళ్ళాం కావల్సొచ్చిందా అని నవ్వుతారు" అన్నాడు.

"నిజంగా కావల్సి వచ్చింది కదా. అయినా ఎవరూ మిమ్మల్ని మంచాల గురించి అడగనప్పుడు, వచ్చిన ప్రతి వాళ్ళకీ మీరెందుకు కూర్చోబెట్టి చెప్తారు" అరిచింది.

"ఇదిగో మళ్ళీ విను. నువ్వంత చిన్నతనం ఫీలవ్వాల్సిందేమీ లేదు. నువ్వు నాకు తోడు. నేను నీకు నీడ. నీకు నా భార్యా స్థానం కల్పించాను. నువ్వు నాకు సేవ చేస్తుకుంటున్నావు. ఇంతకుమించి మాట్లాడితే ఊరుకోను" అంటూ రగడ చేశాడు.

అతనికేమైనా పిచ్చా అనుకుంది. 'చంపేస్తాను' అంటాడు. కానీ, దగ్గరకి రాడు. వంటి మీద ఒక్కదెబ్బ వెయ్యడు. దూరంగా చిందులు తొక్కుతాడు. పనికిరాని వాదమేదో చేస్తాడు. వినకుండా వీలు కూడా ఉండదు. "ఇదిగో ఇలా చూడు. నా మాటలు వినకుండా తప్పించుకుందామంటే కుదరదు. చంపేస్తా" అంటాడు. క్షణంలో రేవతికి భయం వేస్తుంది. కానీ అతనామె దగ్గరకి రాడు.

ఈ దేశంలో స్త్రీకి వివాహం ఒక జీవనోపాధి. ఆమె బ్రతుకు గడవడానికి పెళ్ళి చేసుకోవాలి. భర్తపోషిస్తాడు. కూడూ, గుడ్డా, ఇల్లూ, వాకిలీ ఇస్తాడు. దానికి ఆమె అతని చాకిరీ చేస్తుంది. సుఖాన్నిస్తుంది. పిల్లల్ని కంటుంది. పెంచుతుంది. కొట్టినా,

తిట్టినా నోరెత్తదు. బానిసలా పడుంటుంది.

రేవతి ఆలోచిస్తూంటే తన మీద తనకే చిరాకుగా, కోపంగా ఉంది. ఏదో విధంగా తను ఒంటరిగా బ్రతకగలననుకోలేదు. ఏదో భయం.

తమ్ముడి సంసారంతో కలిసి ఉంటే, తనేదో వాళ్ళ రక్షణలో ఉన్నట్టు ధైర్యం. అక్కడి అవమానాల్లోంచి ఇక్కడ రక్షణ అనే నరకంలోకి పడింది. అంతేగాని తను స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఉందామనుకోలేదు. ఎందుకు? ఏదో భయం.

హింసల్లో రకరకాల హింసలుంటాయి. ఇది మాటలతోనే హింస. వాగుడుతో హింస. అతనొక సూడో కల్చర్ పిచ్చిలో ఉంటాడు. ముఖ్యంగా ఆడవాళ్ళు ఇలా ఉండాలి అని ఒక అభిప్రాయం. ఆ అభిప్రాయానికి సంస్కృతి అనే రంగు పులుముతాడు.

"ఇంకాస్త బొట్టు పెద్దిగా పెట్టుకో".

"నువ్వు గుంటూరు జరీ చీరలో ఎంతో హుందాగా ఉంటావు. కుర్రదానిలా సిల్కు చీరలు వద్దు" అంటాడు.

చూసే వాళ్ళంతా రేవతి మెడలో మూడు పేటల పలకసరులు, లావుపాటి సూత్రాల గొలుసు చూసి ఆమె జాతకం తిరగబడిపోయిందని భావిస్తూ ఉంటారు.

ఇదే రక్షణ, ఇదే తోడూ నీడ, ఇదే సంసారం, ఇదే స్త్రీ జీవితానికి పరమావధి అని సరిపెట్టుకోవాలంటే రేవతికి ఊపిరి అడటం లేదు.

మూడు నెలల్లో మూడు జన్మల అనుభవం వచ్చినట్లనిపించింది.

"ఏమిటా మొద్దు నిద్ర లే...లే... సంసారైన ఆడది సూర్యుడుదయించకుండా లేవాలి". భాస్కరం మాటలతో లేచింది రేవతి. లేస్తూంటేనే కళ్ళు తిరిగాయి. కడుపులో వికారం తిప్పేసింది. పది రోజులుగా మనసులో పట్టి పీడిస్తున్న అనుమానం ఒక్కసారి పెనుభూతమై భయపెట్టింది.

• • •

డాక్టర్ రాజేశ్వరి అంతా విన్నది. రేవతికి చిన్ననాటి స్నేహితురాలు రాజేశ్వరి. అందువల్లే రేవతి వైద్యపరమైన విషయాలే కాకుండా సంసారం గురించి కూడా స్నేహితురాలితో మనసు విప్పి చెప్పింది.

"అయితే ఇప్పుడేం చేద్దామనకుంటున్నావ్" అందామె.

"ఆయన అబార్షన్ చేయించుకోమని చంపుకుతినేస్తున్నాడు. నాకు మాత్రం బిడ్డ కావాలని ఉంది".

"గుడ్! అయితే హాయిగా బిడ్డని కని పెంచుకో".

"కానీ, నేను ఒంటరిగా ఏం చెయ్యలేనుగా"

"పిచ్చిగా మాట్లాడకు. భయపడుతూ కూర్చుంటే భయమే. ముఖ్యంగా స్త్రీలు ఉన్నచోటనే ఉండి వాళ్ళ హక్కుల కోసం ధైర్యంగా పోరాడి గెలవాలిగానీ, ఇక్కడ కాదని అక్కడికి, అక్కడ కాదని మరో చోటికి తిరుగుతూ ఉంటే ఎక్కడైనా నిన్ను భయపెట్టి

తరిమి కొట్టేవారుంటారు. ఇప్పుడు నువ్వున్న ఇంట్లో నీకు సర్వహక్కులూ ఉన్నాయని గ్రహించుకో. అక్కడికి పోతాను, ఇక్కడికి పోతానూ అనకు".

"ఇది సాధ్యమే!"

"ఆ... సాధ్యమే. నేను నీకు పూర్తి సాయం చేస్తాను. మెడికల్‌గా నేను చూసుకుంటాను. నీ వయసు వల్ల ఓ మూడు నెలల బెడ్ రెస్ట్ అవసరం కావచ్చు" రాజేశ్వరి అంది. "బిడ్డ ఎదుగుదల గురించి రెగ్యులర్ చెకప్స్ అవసరం" అంటూ ఎన్నో సంగతులు చెప్పింది.

"ఇన్నాళ్ళూ నీ కోసం బతికావో లేదో, ఇప్పుడు మాత్రం నువ్వు కనబోయే బిడ్డ కోసం బతుకు. అదీ ధైర్యంగా బతుకు. నీకేం ఫరవాలేదు".

రేవతి నిటారుగా లేచి నిలబడింది.

• • •

"నీకు వందసార్లు చెప్పినా బుర్రకెక్కడం లేదే? నాకు నువ్వు – నీకు నేను తోడూ నీడగా ఉండాలని పెళ్ళి చేసుకున్నాను గానీ, నీతో పిల్లల్ని కని, ఉయ్యాలలూపి జోలలు పాడటానికి కాదు" భాస్కరం గొంతుపై స్వరంలో ఉంది. ఆ స్థాయిలో అతనికి జవాబు చెప్పాలనీ అనిపించడం లేదు. మౌనంగా ఉండాలనీ అనిపించడం లేదు. ఒక్కసారి రాజేశ్వరి మాటలు గుర్తొచ్చాయి. మాట్లాడకుండా కూర్చోకూడదు. స్థబ్దత వదిలి చైతన్యం తెచ్చెకుంది రేవతి.

"మీరు గట్టిగా అరవకండి. నేను మీరు చెప్పినట్టు అబార్షన్ చేయించుకోను. బిడ్డను కంటాను" ఆమె మాటలు స్థిరంగా ఉన్నాయి.

"వీల్లేదు".

"మీరెవరు వీల్లేదనడానికి? పిల్లల్ని కనాలో వద్దో నిర్ణయించుకునే అధికారం తల్లికే ఉంది తెలుసా!"

"అదేం కుదరదు. నేనొప్పుకోను. నాకింత వండి పెడతాననీ, లేవలేకపోతే సాయంగా ఉంటావనీ చేసుకున్నాను గానీ..." అతని మాటలు పూర్తి కాకుండానే "చాలింక. అదే పనిగా మళ్ళీ మళ్ళీ అవే మాటలు చెప్పకండి" ఆమె కంఠమూ పైకి లేచింది.

"అది కాదు. చెప్పింది అర్థం చేసుకోవేం?" అతని గొంతులో సంకోచం. రేవతి కళ్ళు మూసుకుని కుడిచెయ్యి పైకెత్తి, అరచెయ్యి చూపిస్తూ–

"ఆపండి. మాటలొద్దు" అంది.

భాస్కరంలో చిన్న భయంలాంటిది కలిగి ఒక అడుగు వెనక్కి వేశాడు.

అంతవరకూ తలుపు దగ్గర నిలబడి ఉన్న పార్వతమ్మ అంతా వింది.

"ఆడదానికి ధైర్యం లేకపోతే బతుక్కు రావడం మహాకష్టం. రేవతికి నేను లేనా ఏమిటి అండగా" అనుకుంటూ ఏమీ ఎరగనట్టు లోపలికి అడుగు పెట్టింది.

(ఆంధ్రప్రభ డైలీ 12-04-2009)